# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 03 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## 2 గంటల్లోనే హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లవచ్చు

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర బడ్జెట్ సమర్పణకు ఒక రోజు తర్వాత కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీ నుంచి వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రాల వారీ కేటాయింపులు, కీలక రైల్వే ప్రాజెక్టులను వెల్లడించారు. ముఖ్యంగా బెంగళూరు–హైదరాబాద్–చెన్నై హై–స్పీడ్ రైలు కారిడార్‌లు దక్షిణ భారతదేశంలో ప్రధాన "గేమ్–చేంజర్"గా ఉంటాయని మంత్రి వైష్ణవ్ పేర్కొన్నారు. కర్ణాటకకు ఈ బడ్జెట్ రికార్డ్ కేటాయింపుతో ఉందని తెలిపారు. రాష్ట్రానికి రూ.7,748 కోట్లు రైల్వే కేటాయింపు మరియు రూ.52,950 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రకటించారు.

మిగితా 2వ పేజీలో

## అక్రమాలకు పాల్పడితే విచారణ ఎదుర్కోవాల్సిందే



- నోటీసులు ఇస్తేనే రాద్ధాంతమా?
- ప్రజలు తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలి
- కొందరు తమకు తామే తెలంగాణ జాతిపితలమని చెప్పుకుంటారు
- కోదండరామ్ ఉద్యమకారుడు కాదా?
- రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారు
- రాజ్యాంగంపై దాడిని తిప్పికొట్టాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్, కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కొందరు తమకు తామే తెలంగాణ జాతిపితలమని చెప్పుకుంటున్నారని, ఉద్యమకారులను అవమానించారని గగ్గోలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. వారి పాలనలోనే ఉద్యమకారులను అవమానించలేదా? అని ప్రశ్నించారు. అక్రమా లకు పాల్పడితే ఎవరైనా తప్పనిసరిగా విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా చట్టానికి లోబడి సమాధానం చెప్పాల్సిందేనని తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం, ఈ సందర్భంగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి పురస్కారం ప్రదానం చేశారు.

మీ ఇంటి తలుపులు బద్దలు కొట్టలేదని, మిమ్మల్ని ఎవరూ ఈడ్చుకెళ్లలేదని, చేసిన తప్పులకు చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చారని సీఎం గుర్తు చేశారు. నోటీసులు ఇస్తేనే తెలంగాణ సమాజానికి అవమానం జరిగిందన్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేసి ప్రాణాలే అర్పించారని గుర్తు చేస్తూ, ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వారు ఏం త్యాగం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఏకం చేసి ముందుండి నడిపించిన ప్రొఫెసర్ కోదండరామ్ ఉద్యమకారుడు కాదా? అని సీఎం ప్రశ్నించారు. ఆనాడు తలుపులు బద్దలు కొట్టి కోదండరామ్‌ను అరెస్టు చేసిన ప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని నిలదీశారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తేనే రాద్ధాంతం చేయడం తగదన్నారు.

రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేల కోట్ల ఆస్తులు సంపాదించిన వారు ఉద్యమకారులమని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. ప్రజలు తిరస్కరించినప్పుడు అర్థం చేసుకుని హుందాగా తప్పుకుంటే కొంతైనా గౌరవం నిలబడేదన్నారు. ప్రజలే తప్పు చేశారన్న మాట ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.

**జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు సముచితం**

రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి దక్కడం సముచితమని సీఎం అన్నారు. తొలి తరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, మలి తరంలో జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి తెలంగాణ సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సుదర్శన్ రెడ్డి చేసిన పోరాటం ఆదర్శనీయమని పేర్కొన్నారు.

**రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం**

అరాచక శక్తులకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి అని సీఎం గుర్తు చేశారు. తన 500 ఎకరాల భూమిని పేదల కోసం దానం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డికి తెలంగాణ సమాజంలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రావి నారాయణ రెడ్డి గారి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చడం, వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అందరితో చర్చించి, వారి గౌరవాన్ని పెంచేందుకు మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని సముచితమైన స్థానం కల్పిస్తామని వెల్లడించారు.

'బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి' అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి

మిగితా 2వ పేజీలో

## భారత్‌పై అమెరికా టారీఫ్‌లు తగ్గింపు



- 25 శాతం నుంచి 18 శాతానికి కోత
- మోడీ నాకు గొప్ప స్నేహితుడు : అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**బలగం టీవి, వాషింగ్టన్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పట్ల తన వైఖరిని మార్చుకున్నారు. ఇటీవల యూరోపియన్ యూనియన్––భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఆందోళనకు గురైన ట్రంప్, ఇప్పుడు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇచ్చారు. భారత్‌పై విధించిన ప్రతీకార టారీఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపిన ట్రంప్, మోదీ తనకు గొప్ప స్నేహితుడని పేర్కొన్నారు. భారత్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**వాణిజ్యం, యుద్ధంపై చర్చ**

ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ స్పందిస్తూ, "ఈరోజు ఉదయం భారత ప్రధాని మోదీతో మాట్లాడడం నాకు గౌరవంగా భావిస్తున్నా. మోదీ శక్తివంతమైన నాయకుడు. వాణిజ్యం, ఉక్రెయిన్––రష్యా యుద్ధాన్ని ముగించే అంశాలపై విస్తృతంగా చర్చించాం" అని తెలిపారు.

**చమురు కొనుగోలుపై కీలక నిర్ణయం**

ఈ సందర్భంగా రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు ప్రధాని మోదీ అంగీకరించారని ట్రంప్ వెల్లడించారు. ఇకపై భారత్ అమెరికా, వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయనుందని పేర్కొన్నారు.

## లోక్‌సభలో తీవ్ర గందరగోళం

- మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకం అంశాన్ని ప్రస్తావించిన ఎంపీ రాహుల్ గాంధీ
- రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా అభ్యంతరం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభలో సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతల తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రసంగం ప్రారంభించగానే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 2020లో భారత్–చైనా మధ్య నెలకొన్న లద్దాఖ్ ప్రతిష్టంభనపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించి ఒక మ్యాగజైన్ ప్రచురించిన కథనాన్ని కాంగ్రెస్ ఎంపీ, విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. దీంతో సభలో గందరళగోళం ఏర్పడింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.నరవణే స్మృతిగ్రంథం ఇంకా అధికారికంగా ప్రచురితం కాలేదని, అలాంటి పుస్తకం నుంచి ఉటంకణలు చేయడం సభా నిబంధనలకు విరుద్ధమని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దీనికి అమిత్ షా కూడా మద్దతు తెలుపుతూ, విధివిధానాలను ఉల్లంఘిస్తూ ప్రతిపక్షం వ్యవహరిస్తోందని విమర్శించారు.

తాను ఉటంకించిన పత్రం పూర్తిగా ప్రామాణికమైనదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తొలుత ఈ అంశాన్ని లేవనెత్తాలన్న ఉద్దేశం తనకు లేదని, కానీ చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య కాంగ్రెస్ పార్టీ దేశభక్తిని ప్రశ్నించడంతో స్పందించాల్సి వచ్చిందన్నారు. "దేశభక్తి గురించి ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అన్న చర్చ అవసరం లేదు. మా దేశభక్తి ఎక్కడా సమాధి కాలేదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

తేజస్వీ సూర్య ప్రసంగంలో ఎక్కడా ప్రతిపక్షం దేశభక్తిని ప్రశ్నించలేదని అమిత్ షా తెలిపారు. 2004––2014 మధ్య కాలాన్ని ప్రస్తావిస్తూ అప్పటి పాలనలో జాతీయత, సంస్కృతి, భాషలకు తగిన గౌరవం లభించలేదన్న విషయమే ఆయన చెప్పారని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతలే సభా నిబంధనలను ఉల్లంఘిస్తూ మాట్లాడుతున్నారని అమిత్ షా ఆరోపించారు.

**స్పీకర్ జోక్యం**

సభా కార్యక్రమాలకు సంబంధం లేని అంశాలపై పుస్తకాలు, పత్రికల నుంచి ఉటంకణలు చేయరాదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గుర్తు చేశారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, భారత్–చైనా సంబంధాలపై మాట్లాడేందుకు తనకు ఏ నిబంధన అడ్డుపడుతోందో చెప్పాలని ప్రశ్నించారు.అయితే, రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో భారత్––చైనా అంశం లేదని, దేశ గౌరవాన్ని దెబ్బతీసే విషయాలను లేవనెత్తకూడదని స్పీకర్ సూచించారు. దీనికి ప్రతిగా అంతర్జాతీయ సంబంధాలపై మాట్లాడటం కూడా రాష్ట్రపతి ప్రసంగ పరిధిలోకి రాదా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

మిగితా 2వ పేజీలో

## మున్సిపల్ ఎన్నికలకు మార్గదర్శకాలు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి సోమవారం తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్లను నేరుగా ఎన్నికైన సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్లైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నుకుంటారు. ఎక్స్ అఫిషియో సభ్యులు తాము ఓటు వేయాలనుకున్న కార్పొరేషన్, మున్సిపాల్టీలో తమ ఓటు హక్కును ఫిబ్రవరి 11 నుంచి14 వరకు సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేసే వరకు నమోదు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 16న ఎన్నికైన సభ్యులతో సంబంధిత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అదే రోజు చేతులెత్తే పద్ధతిలో కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్లను ఎన్నుకుంటారు ఎన్నికైన సభ్యుల్లో 50 శాతాన్ని కోరంగా పరిగణిస్తారు. అంత కన్నా తక్కువ మంది హాజరైనా, మరే ఇతర కారణాల చేత సమావేశం వాయిదా పడినా..ఆ ఎన్నికను తదుపరి రోజు నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ఎన్నికైన అభ్యర్థులు విప్ ఆదేశాలను పాటించకుంటే ఆయా పార్టీలు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారు.

మున్సిపల్ పరోక్ష ఎన్నికల్లో పాల్గొనే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటు హక్కు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ పరోక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 11 నుంచి 14 వరకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్ట్‌ట్యాగ్ విధానంలో కీలక సంస్కరణ

- కేవైవీ బాధ్యత బ్యాంకులకే అప్పగింపు
- వాహనదారులకు ఇకపై యాక్టివేషన్ ఆలస్యం ఉండదు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఫాస్ట్‌ట్యాగ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కీలక సంస్కరణను అమలు చేసింది. ఫాస్ట్‌ట్యాగ్ యాక్టివేషన్ సమయంలో వాహన వివరాల ధృవీకరణకు సంబంధించిన పూర్తి బాధ్యతను బ్యాంకులకే అప్పగించింది. ఈ మార్పుతో ఫాస్ట్‌ట్యాగ్ జారీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.ఇంతవరకు ఫాస్ట్‌ట్యాగ్ పొందిన అనంతరం వాహన యజమానులు ప్రత్యేకంగా 'నో యువర్ వెహికల్' ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండేది. దీంతో యాక్టివేషన్‌లో జాప్యం, టోల్‌ప్లాజాల వద్ద ఇబ్బందులు, రీఫండ్‌లు నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తేవి.

కొత్త విధానం ప్రకారం ఫాస్ట్‌ట్యాగ్ జారీకి ముందే బ్యాంకులు వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరిస్తాయి. ఫాస్ట్‌ట్యాగ్ జారీ అయిన తర్వాత వాహన యజమానులు ప్రత్యేకంగా కేవైవీ పూర్తి చేయాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల ఫాస్ట్‌ట్యాగ్ యాక్టివేషన్ వేగంగా జరుగుతుందని అధికారులు తెలిపారు.

**పాత ఫాస్ట్‌ట్యాగ్‌లకూ వర్తింపు**

ఈ సడలింపు కొత్తగా జారీ అయ్యే ఫాస్ట్‌ట్యాగ్‌లకే కాకుండా, ఇప్పటికే జారీ చేసిన ఫాస్ట్‌ట్యాగ్‌లకూ వర్తిస్తుందని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. అందువల్ల ఇకపై కేవైవీ తప్పనిసరి కాదని పేర్కొంది.అయితే ఫాస్ట్‌ట్యాగ్ వినియోగంలో మోసాలు జరిగినట్లు అనుమానం తలెత్తిన సందర్భాల్లో మాత్రం సంబంధిత వాహన యజమానులు కేవైవీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం లక్షలాది వాహనదారులకు ఉపశమనాన్ని కలిగించనుందని అభిప్రాయపడ్డారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

- ఎన్నిసార్లు కేంద్రాన్ని కోరినప్పటికీ ఆయిల్ పామ్ పై దిగుమతి సుంకం పెంచలేదు
- పసుపు బోర్డుకు నిధుల కేటాయింపు లేదు.
- కొకొనట్ బోర్డు ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ప్రకటన లేదు
- ఎరువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది.
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్––2026 తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నిరాశ కలిగించింది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది రైతుల ఆశలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు.తెలంగాణ రాష్ట్రం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆయిల్ పామ్ దిగుమతులపై సుంకం పెంపు విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీని వలన రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉంది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన బదులు, దిగుమతులకు అనుకూలంగా కేంద్రం వ్యవహరించడం దురదృష్టకరమని మంత్రి అన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటుకు నిధుల కేటాయింపు లేకపోవడం, అలాగే పసుపును ఎఅస్రప్త ఋశ్రీబవ జతీశీజూగా గుర్తించకపోవడం తెలంగాణ పసుపు రైతులకు తీవ్ర నిరాశను కలిగించింది. లక్షలాది మంది పసుపు రైతులు ఎదురుచూస్తున్న ఐవసఐష్ఠ్వస ఖీబఅం గురించి బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన లేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నార్థకంగా మార్చిందని పేర్కొన్నారు. అదేవిధంగా, కొబ్బరి (కోకనట్) బోర్డు ఏర్పాటు విషయమై కూడా ఎలాంటి ప్రకటన లేకపోవడం రాష్ట్ర రైతాంగానికి మరో ఎదురుదెబ్బగా మారిందన్నారు

మిగితా 2వ పేజీలో

## సంక్షేమ రంగాల్లో ప్రభుత్వం వేగంగా ముందుకు

- సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన మార్పులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఆధునీకరించిన ఐ అండ్ పీఆర్ శాఖ వెబ్‌సైట్ ప్రారంభం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఒక్కో ఇటుక పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కి అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పులకు నాంది పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. ఆధునీకరించిన ఐ అండ్ పీ ఆర్ శాఖ వెబ్‌సైట్‌ను బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ అండ్ పిఆర్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ తదితర అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ ప్రజలు ఏ మార్పును కోరుకుంటూ కాంగ్రెస్ ప్రజాపాలనకు మద్దతిచ్చారో, ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే స్పష్టమైన ఫలితాలు చూపించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయని అన్నారు. ప్రజా ప్రభుత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, అభివృద్ధి––సంక్షేమ కార్యక్రమాలు సమతుల్యంగా అమలవుతున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న ఈ మార్పులు ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయన్నారు. 'తెలంగాణ రైజింగ్ ––2047' విజన్‌తో ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుంటూ, మరోవైపు పేదల ఆకాంక్షలు నెరవేర్చే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ద్విముఖ వ్యూహంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను ప్రజా ప్రభుత్వం సృష్టిస్తోందని తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో సమాచార–ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు వేగంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు.

## సికింద్రాబాద్ శాంతి ర్యాలీకి హైకోర్టు అనుమతి

- పోలీసు శాఖకు ఆదేశం

వివరాలు 2వ పేజీలో



## సర్పంచి పదవి కోసం కన్న కూతురినే హతమార్చిన తండ్రి

- నిజాంసాగర్ కెనాల్ బాలిక హత్య కేసులో సంచలన నిజాలు వెలుగులోకి..

**బలగం టీవి, నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని నిజాంసాగర్ కెనాల్‌లో ఇటీవల వెలుగులోకి వచ్చిన బాలిక హత్య కేసులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. కెనాల్‌లో మృతదేహంగా లభ్యమైన బాలికను మహారాష్ట్ర ముఖేడ్ తాలూకా కేరూర్ గ్రామానికి చెందిన ప్రాచి (6) గా గుర్తించారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించిన వివరాల ప్రకారం, రాబోయే ఆరు నెలల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కేరూర్ గ్రామ సర్పంచిగా పోటీ చేయాలనే ఆశతో బాలిక తండ్రి పాండురంగ ఈ ఘోరానికి పాల్పడ్డాడు. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నవారికే సర్పంచి పదవికి అర్హత ఉండటంతో, ముగ్గురు పిల్లలున్న పాండురంగ ఎన్నికల్లో అనర్హుడిగా మారాడు. ఈ నేపథ్యంలో తన చిన్న కూతురైన ప్రాచిని దత్తత ఇవ్వాలనే ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఫలించలేదు. చివరకు రాజకీయ ఆశయాల కోసం కన్న కూతురినే హత్య చేయాలని నిర్ణయానికి వచ్చాడు. ప్రస్తుత సర్పంచి గణేశ్ సహకారంతో పాండురంగ ప్రాచిని ఎడపల్లి మండలానికి తీసుకొచ్చి, నిజాంసాగర్ కెనాల్ వెనుక భాగం నుంచి నీటిలోకి తోసేశాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలిక ఊపిరి ఆడక మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడు పాండురంగతో పాటు సహకరించిన కేరూర్ సర్పంచి గణేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సైసహ పోలీసు సిబ్బందిని సీపీ సాయి చైతన్య అభినందించారు.

## చట్టవిరుద్ధమా, చట్టబద్ధమా..? అనేది కోర్టు నిర్ణయించాలి'

- సీపీ న్యాయమూర్తిగా, జ్యూరీగా వ్యవహరిస్తున్నట్లే కనిపిస్తోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



చట్టవిరుద్ధమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నిం చడం ముగిసింది అని ఆదివారం రాత్రి సిట్ చీఫ్ వి.సి. సజ్జనార్ ప్రకటిం చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ,సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించారు. తన సోషల్ మీడియా పోస్టులో, "కమిషనర్‌గారు, మీరు న్యాయమూర్తిగా, జ్యూరీగా వ్యవహరిస్తున్నట్లే కనిపిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధమా, చట్టబద్ధమా..? అనేది కోర్టు నిర్ణయించాలి" అని వ్యాఖ్యానించారు.

మిగితా 2వ పేజీలో

## 'చట్టవిరుద్ధం' అని ఎలా ప్రకటిస్తారు

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



చట్టవిరుద్ధమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారించడం ముగిసింది అని ఆదివారం రాత్రి సిట్ చీఫ్ సి.పి. సజ్జనార్ ప్రకటించడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేసుపై విచారణ జరుగుతుండగానే ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని అధికారికంగా 'చట్టవిరుద్ధం' అని ఎలా ప్రకటించవచ్చో ఆయన ప్రశ్నించారు. హరీశ్‌రావు తెలిపినట్టు, ఇలా అధికారికంగా చెప్పడం చట్టవ్యతిరేకమే కాక, ఆందోళనకరమని అన్నారు.

హరీశ్‌రావు తన సోషల్ మీడియా పోస్టులో, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తీర్పు చెప్పే వరకు ఏ ఆరోపణను

మిగితా 2వ పేజీలో

# అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు వాయిదా

**ఫిబ్రవరి 17 నుంచి మార్చి 10 వరకు ఎగ్జామ్స్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డా.బిఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ భోజు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నందున పరీక్షలను వాయిదా వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వాయిదా పడిన డిగ్రీ మొదటి, రెండో, మూడో సంవత్సరాలకు సంబంధించిన వివిధ సెమిస్టర్ పరీక్షలను తిరిగి ఈనెల 17 నుంచి మార్చి 10 వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు పరీక్ష తేదీకి మూడ్రోజుల ముందు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్ www.braouonline.in ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు తమ సంబంధిత అధ్యయన కేంద్రాలను లేదా విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.braou.ac.inను సంప్రదించాలని పేర్కొన్నారు.

# ఒటీఆర్ అప్‌డేట్ గడువు పొడిగింపు

**పబ్లిక్ సర్వీస్ కమిషన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

వన్ టైం రిజిస్ట్రేషన్ (ఒటీఆర్) అప్‌డేట్ చేసుకునేందుకు గడువు ఫిబ్రవరి 25 వరకు పొడిగించినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. ఈ మేరకు సోమవారం కమిషన్ చైర్మెన్ బుర్రా వెంకటేశం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో అభ్యర్థులు తమ వ్యక్తిగత, విద్య, సామాజిక ఇతర వివరాల ను సరి చేసుకునేందుకు జనవరి 19 నుంచి ఫిబ్రవరి 2 వరకు అవకాశమిచ్చా రు. కమిషన్ వద్ద 31.56 లక్షల మంది నమోదు చేసుకుని ఉన్నారు. అభ్యర్థు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**పాలిసెట్ -2026 నోటిఫికేషన్ విడుదల**

పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్)-2026 నోటిఫికేషన్ ను సాంకేతిక శిక్షణ, విద్యామండలి సోమవారం విడుదల చేసింది. ఫిబ్రవరి 2 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలస్య రుసుంతో ఏప్రిల్ 22 వరకు దరకాస్తు చేసుకోవచ్చు. మే 13న పాలిసెట్‌ను నిర్వహిస్తారు. పరీక్ష నిర్వహించిన 12 రోజుల తర్వాత ఫలితాలను విడుదల చేస్తారు. మరిన్ని వివరాలకు 080314 04549లో సంప్రదించాలని మండలి ఒక ప్రకటనలో సూచించింది.





# దర్శకుడు నిమ్మల శంకర్‌కు కేటీఆర్ పరామర్శ

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నిమ్మల శంకర్ మాతృమూర్తి నిమ్మల సక్కుబాయమ్మ ఇటీవల మృతి చెందడంతో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఆయనను పరామర్శించారు. శంకర్ నివాసానికి వెళ్లిన కేటీఆర్, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్‌కు ధైర్యం చెప్పి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను చాటిచెప్పిన 'జై బోలో తెలంగాణ' చిత్ర దర్శకుడైన నిమ్మల శంకర్ తల్లి గత వారం స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే కేటీఆర్ ఆయనను పరామర్శించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే ఎల్. రమణ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు. శంకర్ తల్లి సక్కుబాయమ్మకు నివాళు లు అర్పించిన విషయాన్ని కేటీఆర్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించారు.

# లోక్‌సభలో తీవ్ర గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

**సభ వాయిదా**

ప్రతిపక్ష సభ్యులు, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సహా పలువురు, ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ గట్టిగా నిరసన వ్యక్తం చేశారు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను వాయిదా వేశారు. అంతకుముందు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతల తీర్మానాన్ని సమర్థిస్తూ, 2004--2014 కాలాన్ని "కోల్పోయిన అవకాశాల దశాబ్దం"గా అభివర్ణించారు. బలహీన నాయకత్వం--బలమైన నాయకత్వం మధ్య తేడా కాంగ్రెస్, బీజేపీల మధ్య స్పష్టంగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# 'చట్టవిరుద్ధం' అని ఎలా ప్రకటిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

నేరంగా పరిగణించలేమని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 లోనిచ్చిన హక్కుల ప్రకారం, పోలీసులు కేవలం దర్యాప్తు బాధ్యతను మాత్రమే నిర్వహిస్తారు. విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులు కాదని స్పష్టం చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధమా లేదా చట్టబద్ధమా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, PUCL vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన రక్షణా ప్రమాణాల ప్రకారం కోర్టు నిర్ణయం ద్వారా మాత్రమే తెలుతుంది. హరీశ్‌రావు పేర్కొన్నట్టు, సిట్ చీఫ్ సజ్జనార్ 'చట్టవిరుద్ధమైన ఫోన్ ట్యాపింగ్' అనే పదజాలం ఉపయోగించడం ద్వారా దర్యాప్తు ఫలితాన్ని ముందే నిర్ణయించినట్లే సూచించడం చట్టరంగంలో తగినది కాదని, ఈ విధానం 1968 నాటి అఖిల భారత సర్వీసుల నిబంధనలకు విరుద్ధమని అన్నారు.

# 2015లో తాడిచర్ల-1 బొగ్గు గనులను తెలంగాణకు కేటాయించాం

**కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల--1 బొగ్గు గనుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేసింది. తాడిచర్ల--1 బొగ్గు గనులను 2015 ఆగస్టు 31న తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయించినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో తెలిపారు. అయితే, బొగ్గు గనుల కేటాయింపులపై నియమించిన ఉన్నత స్థాయి కమిటీ 2019 మార్చిలో నివేదిక సమర్పించిందని, ఆ నివేదికకు ఆమోదం లభించిన అనంతరం 2020 జూన్ నుంచి దేశవ్యాప్తంగా బొగ్గు గనుల కేటాయింపు విధానం పూర్తిగా మారిందని కేంద్రమంత్రి వెల్లడించారు.

తాడిచర్ల--1 బొగ్గు గనుల అంశంపై కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. వ్యాపార అవసరాల కోసం వినియోగించే బొగ్గు గనులను కేవలం వేలం ద్వారానే కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ సూచించినట్లు తెలిపారు. అయితే, కొన్ని అత్యవసర, ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నేరుగా కేటాయింపులు చేయవచ్చని కమిటీ స్పష్టం చేసినట్లు చెప్పారు. అదే సమయంలో తాడిచర్ల--2 బొగ్గు గనులను ఇప్పటివరకు ఎవరికీ కేటాయించలేదని లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

ఇక రాజ్యసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తగిన కేటాయింపులు లేవని, ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని విమర్శించారు.మరోవైపు, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల వేలం ప్రక్రియలో ప్రభుత్వ రంగ సంస్థలకు గనులు కేటాయించడంలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై ఆరోపించారు. రాష్ట్రాలకు ప్రాధాన్యం లేకుండా, ప్రైవేట్ రంగానికే గనులు కట్టబెడుతున్నారని విమర్శించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచర్ల--1 బొగ్గు గనులు కేటాయించిన విషయం వాస్తవమేనని స్పష్టం చేశారు.

# 2 గంటల్లోనే హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

హై-స్పీడ్ రైలు ప్రాజెక్టుల ముఖ్యాంశాలు:

బెంగళూరు-చెన్నై-హైదరాబాద్ కారిడార్ "డైమండ్ ప్రాజెక్ట్"గా అభివృద్ధి అవుతుంది.

బెంగళూరు-చెన్నై ప్రయాణ సమయం కేవలం ఒక గంట 13 నిమిషాలు.

బెంగళూరు-హైదరాబాద్ హై-స్పీడ్ రైలు మార్గంలో ప్రయాణ సమయం దాదాపు రెండు గంటలు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధికి దోహదం.

**ప్రయోజనాలు:**

వేగవంతమైన కనెక్టివిటీ ద్వారా తయారీ, డిజైన్, ఐటీ సేవలకు ప్రోత్సాహం.

బెంగళూరు టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్గా మరింత అభివృద్ధి చెందుతుంది.

ప్రతిపాదిత ఇతర హై-స్పీడ్ రైలు కారిడార్‌లు:

హైదరాబాద్-బెంగళూరు
చెన్నై-బెంగళూరు
ముంబై-పుణే
పుణే-హైదరాబాద్
హైదరాబాద్-చెన్నై
ఢిల్లీ-వారణాసి
వారణాసి-సిలిగురి

వీటితో దక్షిణ భారతదేశంలో అంతర్ నగర ప్రయాణం మరింత సులభం అవుతుంది అని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

.ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలు రైతులపై మరింత భారం మోపనున్నాయి. ఇప్పటికే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించే చర్యలు బడ్జెట్‌లో పూర్తిగా లేవని మంత్రి తెలిపారు.రైతులకు అత్యంత కీలకమైన ఎంఎస్‌పీ(కనీస మద్దతు ధర)కు చట్టబద్ధ హక్కు కల్పించడంలో కేంద్రం మరోసారి విఫలమైంది. దీని వలన రైతుల ఆదాయ భద్రతపై అనిశ్చితి మరింత పెరిగిందన్నారు. వ్యవసాయ మార్కెటింగ్, ధరల స్థిరీకరణ, మార్కెట్ సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం కేంద్ర బడ్జెట్ లోని ప్రధాన లోపమని అన్నారు. దేశీయ నూనెగింజల రైతులను రక్షించేలా తినుబండార నూనెలపై ఇంపోర్ట్ డ్యూటీలపై ఎలాంటి నిర్ణయం తీసుకో కపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. కేంద్ర పథకాల ఏకీకరణ పేరుతో తెలంగాణకు వచ్చే నిధుల్లో కోత విధించడం రాష్ట్రానికి తీరని అన్యాయం అని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యం ఇప్పటికీ మాటలకే పరిమితమైందని, దానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదన్నారు.వ్యవసాయ రంగంలో బడ్జెట్‌లో ప్రస్తావించదగిన ఏకైక అంశంాాక్మీ ఆధారిత కార్యక్రమాల ప్రస్తావన మాత్రమేనని, అయితే ధర భద్రత, మార్కెట్ భరోసా లేకుండా కేవలంాాక్మీ రైతు సమస్యలకు పరిష్కారం కాదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. మొ త్తంగా, కేంద్ర బడ్జెట్--2026 తెలంగాణ రైతాంగానికి ఆశలు నింపడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రానికి ప్రత్యే కంగా యెటువంటి ప్రత్యేక ప్రయోజనం లేకుండా రూపొం దించబడిందని మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# చట్టవిరుద్ధమా, చట్టబద్ధమా..? అనేది కోర్టు నిర్ణయించాలి'

(మొదటి పేజీ తరువాయి)

"ఇలాంటి తీవ్ర అభ్యంతరకరమైన ప్రకటనలను గౌరవ కోర్టులు పరిగణిస్తాయి, తగిన చర్యలు తీసుకుంటాయి" అని పేర్కొన్నారు.సిట్ అధికారులు కేసీఆర్‌ను ఆదివారం ఆయన నివాసంలో ఐదు గంటలపాటు విచారించిన తరువాత, ప్రకటన చేస్తూ సజ్జనార్ "ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్ కేసు" అని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటనపై రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చలు ప్రారంభమయ్యాయి.

# అక్రమాలకు పాల్పడితే విచారణ ఎదుర్కోవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు. దేశంలో మొట్టమొదటి ప్రధాని నెహ్రూ గారికంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణ రెడ్డి గారితో నెహ్రూ గారు ప్రారంభింపజేశారు. 60 ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణ రెడ్డి. మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డి గారికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు. "నిర్వాహకులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. తొలితరంలో బూర్గుల రామకృష్ణారావు గారు, రావి నారాయణ రెడ్డి గారు స్ఫూర్తినిస్తే, మలితరంలో ఎస్. జైపాల్ రెడ్డి గారు, సుదర్శన్ రెడ్డి గారి వంటి వారు తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో వారు పోషించిన పాత్ర మనందరికీ గుర్తుంది. వారి అనుభవాలు పరిపాలనలో ఉపయోగపడుతున్నాయి" అని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి గారు, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి గారితో పాటు ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయని, ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలన దిశగా దేశాన్ని నడిపించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసినవారు ఎంతటి వారైనా విచారణ ఎదుర్కోవాల్సిందేనని మరోసారి స్పష్టం చేశారు.

# సికింద్రాబాద్ శాంతి ర్యాలీకి హైకోర్టు అనుమతి

**బలగం టీవీ, హైదరాబాద్**

సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటును పురస్కరించుకుని లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన శాంతి ర్యాలీకి అనుమతించాలని హైకోర్టు సోమవారం పోలీసు శాఖను ఆదేశించింది. సోమవారం హైకోర్టు వాదనలు విన్న తర్వాత, గత నెల 21న సమర్పించిన దరఖాస్తుపై సానుకూల స్పందన ఇవ్వాలని సూచించింది. అవసరమైతే, లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులతో సంప్రదించి తగిన నిబంధనలు రూపొందించి, పూర్తి నివేదికను ఈ నెల 5వ తేదీకి సమర్పించాలని 13వ బెంచ్ న్యాయమూర్తి తుకారాం జీ పోలీసు శాఖను ఆదేశించారు. లష్కర్ జిల్లా సాధన సమితి తరపున సీనియర్ న్యాయవాది ముఖీద్ వాదనలు వినిపించారు. గత నెల 17న, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహణకు అనుమతి కోసం పోలీసులు కోరగా, చివరి నిమిషంలో నిరాకరించారు. దీని నేపథ్యంలో, సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ జనవరి 21న నగర పోలీసు కమిషనర్, మల్కాజిగిరి డీసీపీలకు మళ్లీ దరఖాస్తు చేశారు.

# నిత్యం సాధన చేయాలి.. విజయం సాధించాలి..



- టైమ్ టేబుల్ ప్రకారం చదవాలి..
- రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి..
- రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టళ్లలో 10 వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల ప్రేరణ, అవగాహన తరగతులు ప్రారంభం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై నిత్యం సాధన చేయాలని.. విజయం సాధించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ప్రేరణ, అవగాహన తరగతుల కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ లోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ లో సోమవారం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.

అనంతరం విద్యార్థులతో ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని స్పష్టం చేశారు. ఇప్పుడు వచ్చిన మార్కులు భవిష్యత్తు చదువులకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించారు. మూడు విషయాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. గత ప్రశ్నాపత్రాలు కూడా సాధన చేయాలని పేర్కొ న్నారు. ప్రతి రోజూ స్టడీ హవర్ తో పాటుగా సెల్ఫ్ స్టడీ రోజు 3 నుంచి 4 గంటలపాటు చేయాలని సూచించారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగు ణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నల కు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని



స్పష్టం చేశారు. విద్యార్థులందరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా.. ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం.. అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.
- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 28 ఫిర్యాదులు స్వీకరణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 28 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా



ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# యాదవుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు..



- గొర్రె తలకాయతో నిరసనపై బీఆర్ఎస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్

**బలగం టీవీ, వీర్నపల్లి:**

రాజకీయ ప్రయోజనాల కోసం కులవృత్తులను, సామాజిక వర్గాలను కించపరచడం దుర్మార్గమని అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఏటి యాదవ్ పిలుపుమేరకు, సోమవారం వీర్నపల్లి మండల కేంద్రంలోని మెయిన్ చౌరస్తాలో యాదవ కుల పెద్దల సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్ లో రాజకీయ నిరసనలో భాగంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మకు గొర్రె తలకాయను తగిలించి ప్రదర్శించడంపై మల్లేశం యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది యాదవుల మనోభావాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. యాదవుల ఆత్మగౌరవాన్ని కించపరిచిన బిఆర్ఎస్ నాయకులు తక్షణమే యాదవ సామాజిక వర్గానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గొర్రె తలకాయతో నిరసన తెలిపిన బాధ్యులను వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని బిఆర్ఎస్ అధిష్టానాన్ని కోరారు. రాజకీయ విభేదాలు ఉంటే విధానపరంగా పోరాడాలి కానీ, యాదవుల జీవనాధారమైన, సంస్కృతిలో భాగమైన గొర్రెలను ఇలాంటి ప్రదర్శనలకు వాడటం అమానుషమని.. తప్పు ఒప్పుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గొర్రె మా జీవనాధారం.. మా సంస్కృతి. అలాంటి గొర్రె తలకాయను దిష్టిబొమ్మకు కట్టి ప్రదర్శించడం అంటే మొత్తం యాదవ జాతిని హేళన చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు మాడుగుల రాజ్యం యాదవ్, బోడ మల్లేశం యాదవ్, బోడ వెంకట్ యాదవ్, ఉప సర్పంచ్ జక్కుల నరేష్ యాదవ్, లంకల రాజు యాదవ్, బోడ ఎల్లయ్య యాదవ్, మద్దిమల్ల పెద్ద మనుషులు పొట్ల మల్లయ్య యాదవ్, యూత్ అధ్యక్షులు దయ్యాల అంజి యాదవ్, నర్ర దేవరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు..

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (ఫిబ్రవరి 1వ తేది నుండి 28 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్ధంగా డి.జే. వినియోగించారాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# అక్రమ కేసులపై బీఆర్ఎస్ ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటుంది..



- బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేడిపల్లి వివేక్ రెడ్డి

**బలగం టీవీ, వేములవాడ:**

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్య సాధింపు చేస్తుందని.. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ములేకనే సీఎం రేవంత్ వరుసగా నోటీసుల డ్రామా ఆడుతున్నారని వివేక్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని వివేక్ ఖండించారు. తెలంగాణలో ప్రజాపాలన కాదు, నోటీసుల పాలన, డైవర్షన్ పాలన, కక్ష్య సాధింపు పాలన నడుస్తుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్య సాధింపు చేస్తుందని ఆరోపించారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ములేకనే సీఎం రేవంత్ వరుసగా నోటీసుల డ్రామా ఆడుతున్నారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ వరుస స్కాంల నుంచి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు ఇచ్చింది. ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజం అంతా ఉంది. మీ కేసులకు, నోటీసులకు భయపడేది లేదు.. అక్రమ కేసులపై ప్రజా క్షేత్రంలోనే బీఆర్ఎస్ తేల్చుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచక పాలనను తెలంగాణ ప్రజలందరూ గమనిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధం అయ్యారని వివేక్ రెడ్డి పేర్కొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాళ్లల్ల పల్లెలో ఉచిత వైద్య శిబిరం..

- విద్యార్థులకు స్పోర్ట్స్ జెర్సీలు అందజేత
- వృద్ధులకు మోకాలు బెల్టులు, చేతికర్రలు పంపిణి

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

తాళ్ళల్ల పల్లె గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం మరియు విద్యార్థులకు స్పోర్ట్స్ జెర్సీలు అందజేయడం జరిగింది. సోమవారం ఇల్లంతకుంట మండలం తాళ్లల్లపల్లె గ్రామంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిభిరం మరియు విద్యార్థులకు స్పోర్స్ జెర్సీలు, వృద్ధులకు చేతి. కర్రలు, మోకాలు బెల్టులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మీసాల కనకరాజు మాట్లాడుతూ.. గ్రామంలో ఉచితంగా బిపి , షుగర్ పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు స్పోర్ట్స్ జెర్సీలు, వృద్ధులకు చేతి కర్రలు, మోకాలు బెల్టులు అందజేయడం సంతోషంగా ఉందని, ముందు ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని లయన్స్ క్లబ్ వారిని కోరుతూ వారికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాత కిరణ్ కుమార్, రొండ్ల ప్రభాకర్ రెడ్డిలు మాట్లాడుతూ.. సమాజ సేవే లక్ష్యంగా ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ రోజు ఉ చిత మధుమేహ నిర్ధారణ, బిపి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మా లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకై నిర్విరామంగా క్యాంపులు నిర్వహిస్తూ కృషి చేస్తున్నామని లయన్స్ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో 50 మందికి ఉచిత బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది, పలువురు వయోవృద్దులకు చేతి కర్రలు , మోకాళ్ళ బెల్టులు లయన్స్ క్లబ్ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి గుర్రం ప్రవీణ్ కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు కె. సదాశివ రెడ్డి, వార్డు సభ్యులు నూనె కేత శ్రీనివాస్ యాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మీసాల లీల, నాయకులు నూనె శ్రీనివాస్ యాదవ్, మూడపెల్లి చందు , రొండ్ల మధు సూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ ఇరుమల్ల స్వప్న మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.




## కోతులను తరిమికొట్టేందుకు ఎలుగుబంటి వేషం వేసిన సర్పంచ్ రాజిరెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామంలో కోతుల బెడద రోజురోజుకీ పెరుగుతుండటంతో వినూత్నంగా స్పందించారు సర్పంచ్ రాజిరెడ్డి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నాగం పేట గ్రామంలో పంటలను, ఇళ్లను నాశనం చేస్తున్న కోతులను తరిమికొట్టేందుకు సర్పంచ్ రాజిరెడ్డి స్వయంగా ఎలుగుబంటి వేషం ధరించి గ్రామంలో తిరిగారు. ఈ చర్యతో కోతులు భయపడి అడవివైపు పారిపోవడంతో గ్రామస్తులకు కొంత ఉపశమనం లభించింది.గత కొంతకాలంగా కోతుల కారణంగా పంటలకు తీవ్ర నష్టం జరుగుతుండటంతో పాటు, పిల్లలు-వృద్ధులు బయటకు రావడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో సర్పంచ్ ఈ వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. సర్పంచ్ చొరవను గ్రామస్తులు ప్రశంసిస్తూ, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రజలు అధికారు లను కోరుతున్నారు. గ్రామ సంక్షేమం కోసం సర్పంచ్ చేసిన ప్రయత్నం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## హైకోర్టులో సెస్ డైరెక్టర్ నారాయణరావుకు ఊరట..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గంభీరావుపేట సెస్ డైరెక్టర్ నారాయణరావుకు హైకోర్టులో ఊరట లభించింది. వరంగల్‌లోని తెలంగాణ సహకార ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మధ్యంతర సస్పెన్షన్ విధిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, తెలంగాణ సహకార ట్రిబ్యునల్ ఫైల్‌లో ఉన్న ఓపీ నెం.1 ఆఫ్ 2023లో 02.12.2025 తేదీన జారీ చేసిన ఉత్తర్వులపై నాలుగు వారాల పాటు మధ్యంతర సస్పెన్షన్ విధిస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.ఈ ఉత్తర్వులతో నారాయణరావుకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. తదుపరి విచారణ వరకు ట్రిబ్యునల్ ఆదేశాలు అమలులో ఉండవని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాల అనంతరం చేపట్టనున్నట్లు సమాచారం.

# పకడ్బందీ ప్రణాళిక ప్రకారం శివరాత్రికి వసతులు కల్పించాలి..

- **సమన్వయంతో జాతర వేడుకలు విజయవంతం చేయాలి**
- **మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమన్వయ సమావేశం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మహా శివరాత్రి జాతరకు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ఆయా శాఖల అధికారులు వసతులు కల్పించాలని జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించగా, జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే, ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు, హెలిప్యాడ్ వద్ద, ఇతర చోట్ల బారికేడింగ్ పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ ఏడాది 600 బస్సులు ఏర్పాటు చేస్తామని, ఇంకా భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాలు అందుబాటులో పెడుతామని ఆర్టీసీ ఆర్ఎం తెలిపారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో



బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ, ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తులకు అల్పాహారం చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్ధంగా ఉండాలని, వేములవాడ ఏరియా హాస్పిటల్, సిరిసిల్ల జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. నాంపల్లి వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, ఏర్పాట్ల కల్పనకు ఇద్దరు అధికారులను నియమించామని వివరిం చారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. వేములవాడలో లాడ్జ్ లలో అద్దెలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాతరలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, క్యూ లైన్ల వద్ద తాగునీటిని స్టీల్ గ్లాస్ లలో ఇవ్వాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. వచ్చిన భక్తులు దర్శనం, క్షేమంగా వెళ్ళేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జాతరకు సంబందించిన పనులన్నీ రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

**ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు.. ఎస్పీ మహేష్ బీ గితే**

మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ భద్రత చర్యలు పర్యవేక్షిస్తామని వివరించారు. తిప్పాపూర్ బస్సు స్టాండ్, ఇతర బస్సు స్టాండ్, రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామివారికి ఏకాంత సేవలు, పూజలు కొనసాగుతాయని ఆలయ అర్చకుడు చంద్రగిరి శరత్ తెలిపారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర, స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందిస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓలు రాధాబాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో మెరిసిన సిరిసిల్ల అథ్లెట్ కడారి అశోక్..

- **మూడు కాంస్య పతకాలతో జిల్లాకు గర్వం కారణం...**
- **మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో సిరిసిల్ల క్రీడాకారుడి హవా..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వాసి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన అథ్లెట్ కడారి అశోక్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 2న రాజస్థాన్ లోని అజ్మీర్ లో నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన, మూడు కాంస్య పతకాలను సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.10 కిలోమీటర్ల రేసులో, హై జంప్, లాంగ్ జంప్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించిన అశోక్ కుమార్‌ను సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాభిమానులు అభినందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ ఐజీ (పంజాబ్ పోలీస్), ఎన్ఎంఏఏ అధ్యక్షుడు సురేష్ కుమార్ శర్మ, మాజీ డీఐజీ రాకేష్ జోషి తదితరులు అథ్లెట్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, కోచ్‌లు, ఆర్ఆర్‌కే స్టడీ సర్కిల్ ప్రతినిధులు పాల్గొని అభినందనలు తెలిపారు. జిల్లాలోని యువత క్రీడల్లో ముందుకు రావాలని వక్తలు ఆకాంక్షించారు.

## భారత్‌తో మ్యాచ్ బహిష్కరణపై పాక్‌పై ఐసీసీ ఆగ్రహం

**ఇది క్రీడా నిబంధనలకు విరుద్ధం.. పాకిస్థాన్‌కు హెచ్చరిక**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

టీ20 ప్రపంచకప్--2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలని తమ జట్టును ఆదేశించిన పాకిస్థాన్ ప్రభుత్వ నిర్ణయంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య అంతర్జాతీయ క్రీడా నిబంధనలకు విరుద్ధమని, ఇది పాకిస్థాన్ క్రికెట్‌కు ఏ మాత్రం మేలు చేయదని ఐసీసీ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. పాకిస్థాన్ ప్రభుత్వ నిర్ణయం తమ దృష్టికి వచ్చినప్పటికీ, దీనిపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నుంచి అధికారిక సమాచారం కోసం ఇంకా ఎదురుచూస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. టోర్నీలో ఎంపిక చేసిన మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడటం అనే పాకిస్థాన్ వైఖరి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. జాతీయ విధానాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాల పాత్రను గుర్తించి గౌరవిస్తున్నప్పటికీ, ఈ నిర్ణయం సరైనదికాదని పేర్కొంది.

భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులతో పాటు, పాకిస్థాన్‌లోని లక్షలాది మంది అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతారని ఐసీసీ తెలిపింది. ఈ నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్‌పై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాలను చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఐసీసీ సుతిమెత్తగా పీసీబీని హెచ్చరించింది. ఈ విషయాన్ని గంభీరంగా పరిగణనలోకి తీసుకుని, పరిస్థితిని పునఃసమీక్షించాలని ఐసీసీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డును కోరింది.

## 'పాంచాలి పంచభర్తృక' టీజర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

- **ఆరోగ్యకరమైన హాస్యాన్ని ప్రోత్సహించాలి : మంత్రి వెంకట్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'పాంచాలి పంచభర్తృక' టీజర్‌ను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హాస్యం మంచి ఔషధం లాంటిదని, అపహాస్యం కాకుండా ఆరోగ్యకరమైన హాస్యంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నాలను అభినందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలో ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సినీ పరిశ్రమ అభివృద్ధికి, సినిమా కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. చిత్ర నిర్మాణ బృందానికి మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చిత్రానికి గంగ సప్తశిఖర రచన, దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట దుగ్గిరెడ్డి (యూఎస్ఏ) నిర్మాతగా, శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మన్యం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. రాయల్ త్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయి రామ్ ఆర్ట్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది.

# కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్ విడుదల

**వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్**

**బలగం టీవి, హైదరాబాద్**




టాలీవుడ్ యువ నటుడు సంతోష్ శోభన్, మానస వారణాసి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, తాజాగా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. "లవ్ చాయిస్ ఆ, నీడ్ ఆ అనేది నాకు తెలియదు... కానీ ఫేట్ అని మాత్రం తెలుసు" అంటూ సాగుతున్న డైలాగ్స్ ప్రేమను కొత్త కోణంలో ఆవిష్కరిస్తూ యువతను ఆలోచింపజేసేలా ట్రైలర్ ఉంది. అలాగే "ఇంతవరకు ఏమైనా సంపాదించి నువ్వు సుత్తి గానీ, బల్బు గానీ కొనుకున్నావారా?" వంటి డైలాగ్స్ హీరో పాత్రను ఎలివేట్ చేస్తున్నాయి.ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'నాలో నేను' వీడియో సాంగ్ రొమాంటిక్ ఫీల్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు సహ-నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.